మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 88 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

సోమవారం 24 జూన్ 2024


# నేడు హస్తినకు సీఎం రేవంత్

**- మంత్రివర్గ విస్తరణపై అధిష్టానంతో చర్చించే అవకాశం**

**- పీసీసీ అధ్యక్షుడి ఎంపిక నామినేటెడ్ పోస్టులపైనా మంతనాలు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): పార్లమెంట్ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. సోమవారం, మంగళవారం దిల్లీలో ఉండనున్న సీఎం..పార్టీ పెద్దలతో సమావేశం కానున్నారు. మంత్రిమండలి విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక తదితర అంశాలపై చర్చించే అవకాశముంది. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన రాష్ట్రానికి చెందిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశా నిర్దేశం చేయనున్నారు.లోక్‌సభ ఎన్నికలు ముగిసి పాలనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలోనే మంత్రివర్గాన్ని విస్తరించనున్నట్లు తెలిసింది. దీనిపై ఏఐసీసీ ముఖ్య నాయకులతో ఇప్పటికే చర్చించినట్లు సమాచారం. ఈ నెలాఖరుకు లేదంటే జులై మొదటి వారంలో విస్తరణ ఉండొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి కాకుండా మరో 11 మంది మంత్రివర్గంలో ఉన్నారు. సీనియర్ నాయకులు, ముఖ్యులు, శాసనసభ ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారికిచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకోవడంతో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిధ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటే లభించలేదు. మరోవైపు భారాస నుంచి ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు వచ్చి చేరగా, మరికొందరు చేరే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తంగా మరో ఆరుగురిని కొత్తగా మంత్రివర్గంలోకి చేర్చుకోవచ్చు. ప్రస్తుతం నలుగురికి అవకాశం ఉండొచ్చని విశ్వసనీయవర్గాల సమాచారం. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఆధారంగా వీటిలో మార్పుచేర్పులు ఉంటాయని అధిష్ఠానం అప్పుడు వారికి హామీ ఇచ్చింది. అలాగే మంత్రి పదవులను కూడా ఆశించే వారి సంఖ్య భారీగా ఉండటంతోఈ నేపథ్యంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.



# బీఆర్ఎస్‌కు మరో షాక్

**కాంగ్రెస్‌లోకి జగిత్యాల ఎమ్మెల్యే**

హైదరాబాద్, (ప్రజా మంటలు): వరుస ఓటములతో కుంగిపోతున్న బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. రెండ్రోజుల క్రితం సీనియర్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడగా.. తాజాగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అదేబాటలో నడిచారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# ‘పుష్పక్’ ప్రయోగం విజయవంతం



బెంగళూరు (ప్రజా మంటలు): పునర్వినియోగ వాహకనౌకల సామర్థ్యాన్ని పరీక్షించే ప్రయోగం మూడోసారి విజయవంతమైనట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వెల్లడించింది.ఈసారి మరింత సవాళ్లతో కూడిన వాతావరణంలో ప్రయోగాన్ని చేపట్టినట్లు తెలిపింది. అంతరిక్షం నుంచి వచ్చే వాహక నౌక పనితీరు, ల్యాండింగ్ పరిస్థితులను తాజా ప్రయోగం ద్వారా కళ్లకు కట్టినట్లు పేర్కొంది. అంతరిక్షంలోకి ప్రయోగించిన ఉపగ్రహాల్లోని విడిభాగాలు, వాటిని మోసుకెళ్లే వాహకనౌకల పునరుద్ధరణ దిశగా ఇస్రో ఈ ఆర్ఎల్‌వీ ఎల్ఈఎక్స్ ప్రయోగాలను చేపడుతోంది. తద్వారా ఆర్ఎల్‌వీల అభివృద్ధికి అవసరమైన అత్యంత కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడంలో ఇస్రో నైపుణ్యాన్ని తాజా ప్రయోగం పునరుద్ఘాటిస్తున్నట్లు తెలిపింది. ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్ సిరీస్‌లో చివరి పరీక్షను కర్ణాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ లో ఆదివారం ఉదయం నిర్వహించినట్లు వెల్లడించింది. ఆర్ఎల్‌వీ ఎల్ఈఎక్స్-01, ఎల్ఈఎక్స్-02 మిషన్ విజయవంతమైన తర్వాత మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్లు, తీవ్రమైన గాలి పరిస్థితుల్లో చేపట్టినట్లు తెలిపింది. తద్వారా స్వయంప్రతిపత్తి ల్యాండింగ్ సామర్థ్యాన్ని తిరిగి ప్రదర్శించినట్లు మిగతా 2లో..

# నేటి నుంచి లోక్‌సభ సమావేశాలు

**- తొలిరోజు ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌తో ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**- 26 స్పీకర్ ఎన్నిక - 27న ఉభయసభలను ప్రసంగించున్న రాష్ట్రపతి**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): 18వ లోక్‌సభ తొలి సెషన్ సోమవారం ఆరంభం కానుంది. ఈ నెల 24, 25 తేదీల్లో కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ఒడిశాకు చెందిన సీనియర్ ఎంపీ భర్తృహరి మహతాబ్ వ్యవహరించనున్నారు. భర్తృహరి మహతాబ్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందే బిజు జనతాదళ్‌ను వీడి బీజేపీలో మిగతా 2లో..

# భూమికి దగ్గరగా గ్రహశకలం

**- 2038లో ఘటన సంభవించనున్నట్లు ప్రకటించిన నాసా - భూమిని ఢీకొనే అవకాశం 72శాతం ఉన్నట్లుగా వెల్లడి**



న్యూయార్క్ (ప్రజా మంటలు): అమెరికా అంతరిక్ష సంస్థ నాసా తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో 2038 జూలై 12న ఓ ప్రమాదకరమైన గ్రహశకలం భూమికి సమీపంలో వచ్చే అవకాశం ఉండడంతో పాటు ఢీకొట్టే ప్రమాదం ఉందని పేర్కొంది.దీనికి ఇంకా 14 సంవత్సరాల సమయం ఉందని తెలిపింది. ఒక వేళ గ్రహశకలం దగ్గరకు వస్తే ఎలాంటి ప్రమాద నివారణచర్యలు తీసుకోవాలన్న అంశంపై నాసా సమావేశం జరిపింది.అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ఐదవ ద్వైవార్షిక ప్లానెటరీ డిఫెన్స్ ఇంటర్ ఏజెన్సీ టాబ్లెట్‌టాప్ పరిశోధనలను ఏప్రిల్‌లో నిర్వహించింది. జూన్ 20న మేరీల్యాండ్‌లోని లారెల్‌లోని జాన్స్ హాప్‌కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ లాబొరేటరీ లో చేసిన ఈ పరిశోధనల్లో 2038లో ఓ గ్రహశకలం భూమిని ఢీకొనే అవకాశం 72శాతం ఉన్నట్లుగా కనుగొన్నామని పేర్కొంది. ఈ పరిశోధనలో నాసాతో పాటుగా అమెరికా ప్రభుత్వ ఏజెన్సీలు, అంతర్జాతీయంగా నాసాకు సహకారం అందిస్తున్న పలువురు ప్రతినిధులు పాల్గొన్నారని సంస్థ పేర్కొంది. వాషింగ్టన్‌లోని నాసా ప్లానెటరీ డిఫెన్స్ అధికారులు ఎమెరిటస్, లిండ్లీ జాన్సన్ మాట్లాడుతూ ఈ పరిశోధనల ద్వారా ఇంత వరకు కనుగొనని ఓ గ్రహశకలాన్ని, భవిష్యత్తులో మనం ఎదుర్కోబోయే సవాళ్లను తెలుసుకున్నట్టు తెలిపారు. కొన్ని ఏళ్ల అనంతరం ఒక పెద్ద గ్రహశకలం భూమిని ఢీకొనే ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని మనం ఇప్పుడే తెలుసుకోగలిగే సాంకేతికత మనకు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. గ్రహశకలం పరిమాణం, దాని మార్గాన్ని కనుగొనడానికి మరికొన్ని పరిశోధనలు చేయాల్సి ఉంటుందని నాసా తెలిపింది. ఒక కైనెటిక్ ఇంపాక్టర్ గ్రహశకలం మార్గాన్ని మార్చగలదని డార్ట్ ధృవీకరించిందని దీనికోసం ఎన్ఈఓ సర్వేయర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లుగా సంస్థ వెల్లడించింది.

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం


**- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం**

**- రోగులకు మెరుగైన వైద్యం అందిస్తాం:మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్ల్(జనంసాక్షి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, రోగులకు మెరుగైన వైద్యం అందించి, ఆరోగ్య తెలంగాణ రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఎస్ఆర్‌నగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రైవేటు ఆసుపత్రులు సహకరించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచామని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం పేదలకు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించాలన్నారు. నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్?గా పనిచేసిన డా.శరత్ చంద్ర మారుమూల గ్రామాలకు వెళ్లి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ ?రెడ్డి నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని తెలిపారు

## ప్రజా నాడి




# హైదరాబాద్‌లో కుండపోత

**- నగరంలో భారీ వర్షం.. రహదారులు జలమయం**



హైదరాబాద్, (ప్రజా మంటలు): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నగరంలో పలు చోట్ల ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఎల్బీనగర్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, చంపాపేట్, సైదాబాద్, చాదర్‌ఘాట్, మలక్‌పేట్, సరూర్‌నగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, బోరబండ, పంజాగుట్ట, యూసఫ్‌గూడ, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది.దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వనస్థలిపురం వద్ద భారీ వర్షానికి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వరదనీరు చేరింది. రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా.. మరోవైపు రోడ్డుపై వరదనీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. చింతల్‌కుంట వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. వరదనీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి.

# అమెరికాలో కాల్పులు..

**- భారత విద్యార్థి మృతి**




న్యూఢిల్లీ (ప్రజా మంటలు): అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలుగు యువకుడు మృతి చెందాడు. మృతుడిని ఏపీలోని బాపట్ల జిల్లాకు చెందిన దాసరి గోపీకృష్ణ (32)గా గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. కర్లపాలెం మండలం యాజలికి చెందిన గోపీకృష్ణ జీవనోపాధి కోసం 8 నెలల క్రితం అమెరికా వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రంలోని డాలస్‌లో ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం గోపీకృష్ణ కౌంటర్‌లో ఉండగా.. ఓ దుండగుడు నేరుగా వచ్చి తుపాకీతో అతడిపై కాల్పులు జరిపాడు. తీవ్రగాయాలతో గోపి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం దుండగుడు ఓ వస్తువు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.ఆ తర్వాత గోపీకృష్ణను ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. ఈ సమాచారం తెలియడంతో అతడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. గోపి స్వగ్రామం యాజలిలో విషాదఛాయలు అలముకున్నాయి. మరోవైపు దుండగుడు కాల్పులు జరిపిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

మొదటి పేజీ తరువాయి

## 'పుష్పక్' ప్రయోగం విజయవంతం

వివరించింది. 'పుష్పక్' పేరుతో పిలిచే ఈ రెక్కల వాహనాన్ని భారతీయ నౌకాదళానికి చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా తీసుకెళ్లి రన్‌వేకి నాలుగు కిలోమీటర్ల దూరం, 4.5 కిలోమీటర్ల ఎత్తులో జారవిడిచారు. అక్కడి నుంచి క్రాస్-రేంజ్ కదలికలను స్వతంత్రంగా చేపడుతూ రన్‌వే దిశగా వచ్చింది. సెంటర్‌లైన్ వద్ద కచ్చితమైన సమాంతర ల్యాండింగ్‌ను ప్రదర్శించింది. తక్కువ 'లిఫ్ట్-టు-డ్రాగ్' నిష్పత్తితో కూడిన ఏరోడైనమిక్ కాన్ఫిగరేషన్ కారణంగా ల్యాండింగ్ వేగం గంటకు 320 కిలోమీటర్ల కంటే ఎక్కువగా ఉందని ఇస్రో తెలిపింది. రన్‌వేపై ల్యాండ్ కాగానే వాహకనౌక వేగం బ్రేక్ పారాచూట్‌తో తగ్గిందని ఇస్రో తెలిపింది. అనంతరం ల్యాండింగ్ గేర్లు బయటకు వచ్చి వాహనం పూర్తిగా ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ సమయంలో స్థిరత్వం కోసం నోస్ వీల్ స్టీరింగ్ వ్యవస్థ, రడ్డర్‌ను ఆర్ఎల్‌వీ ఉపయోగించుకున్నట్లు వెల్లడించింది. ఎల్ఈఎక్స్-02 ప్రయోగంలో ఉపయోగించిన రెక్కల వాహనం, ఫ్లయిట్ సిస్టమ్స్‌ను ఎలాంటి మార్పులు లేకుండా తాజా ప్రయోగంలో వాడినట్లు తెలిపింది.

## నేటి నుంచి లోక్‌సభ సమావేశాలు

చేరారు. కటక్ నుంచి పోటీచేసి ఏడోసారి విజయదుందుభి మోగించారు.సోమవారం ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయిస్తారు. అనంతరం పార్లమెంట్‌కు చేరుకోనున్న భర్తృహరి 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయిస్తారు. తొలుత ప్రధాని నరేంద్ర మోదీతో భర్తృహరి ప్రమాణం చేయిస్తారు. తర్వాత తనకు సహాయకులుగా రాష్ట్రపతి నియమించిన ప్యానల్ ఆఫ్ ఛైర్‌పర్సన్‌లతో భర్తృహరి ప్రమాణం చేయిస్తారు.అయితే లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఈ నెల 26వ తేదీన జరగనుంది. అనంతరం ప్రధానమంత్రి కేంద్ర మంత్రులను సభకు పరిచయం చేస్తారు. జూన్ 27న పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. 28వ తేదీ నుంచి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. జులై 2 లేదా 3వ తేదీన ఈ చర్చకు ప్రధాని మోదీ సమాధానమిచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత కొన్ని రోజుల విరామం అనంతరం జులై 22న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిస్థాయి బడ్జెట్‌ను జులై 22న ప్రవేశపెట్టనున్నారు.

### రాజ్యసభలో బీఆర్ఎస్ డిప్యూటీ లీడర్‌గా

## వద్దిరాజు రవిచంద్ర - నియమించిన కేసీఆర్

హైదరాబాద్ (ప్రజా మంటలు):
రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు నియమించారు. పార్టీ విప్‌గా ఎంపీ దీవకొండ దామోదర్‌రావునకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ కేసీఆర్ లేఖ రాశారు. ఇదిలా ఉండగా.. ఇటీవల బీఆర్ఎస్ అధినేత రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా సీనియర్ నేత కేఆర్ సురేశ్‌రెడ్డిని నియమించారు. పార్లమెంటరీ పార్టీ, రాజ్యసభ పక్షనేతగా ఉన్న కే కేశవరావు స్థానంలో సురేశ్‌రెడ్డిని నియమించారు. కేకే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన స్థానంలో సురేశ్‌రెడ్డిని పార్టీ పక్షనేతగా ప్రకటించిన కేసీఆర్.. ఈ మేరకు కేఆర్ సురేశ్‌రెడ్డిని నియమిస్తూ రాజ్యసభ సెక్రటరీ జనరల్, లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే.

### ఘనంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం దక్షిణావర్త శంఖముల వితరణ

సికింద్రాబాద్ జూన్ 23
(ప్రజా మంటలు)
యాద వీరేశం దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం వేద బ్రాహ్మణోత్తములచే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది బ్రాహ్మణోత్తములు వైదిక క్రతువులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణోత్తములకు నూతన వస్త్రములు, దక్షిణ తాంబూలంతో పాటు దక్షిణావర్త శంఖమును వైదిక క్రతువులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అంద చేశారు. అదేవిధంగా ప్రధాన ఆలయాలకు శంఖములు అందజేశారు. స్వామివారి నామ స్మరణతో వైదిక ఆవరణ మార్మోగింది. అనంతరం మంగళహారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. వీరయ్య దంపతులకు స్వామివారి శేష వస్త్రముతో పాటు ఆశీర్వచనము చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైదిక క్రతువులు ధోర్బల కృష్ణమూర్తి, శర్మ, సిరిసిల్ల. రామ శర్మ ,రాజనాల. వెంకటేశ్వర శర్మ, ఘనపురం .రాంప్రసాద్ శర్మ ,కొంపెల్ల .రామకృష్ణ శర్మ ,యలమంచి రామకృష్ణ శర్మ ,సంకేపల్లి. సుధాకర్ శర్మ తదితరులు నిర్వహించారు.



## నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- ఒకే చోట ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఓబీసీ,మైనారిటీ గురుకులాలు
- పైలట్‌ప్రాజెక్టుగా కొడంగల్, మధిర నియోజవర్గాల ఎంపిక
- ఇప్పటికే ఆ ప్రాంతాల్లో 20ఎకరాల చొప్పున భూసేకరణ పూర్తి
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్ (ప్రజా మంటలు):



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు.ప్రతీ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం.ఆర్కిటెక్చర్స్ రూపొందించిన పలు నమూనాలను పరిశీలించిన సీఎం, డిప్యూటీ సీఎం.ఒకే చోట ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఓబీసీ,మైనారిటీ గురుకులాలు ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం.పైలట్ ప్రాజెక్ట్ గా కొడంగల్, మధిర నియోజవర్గాల్లో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం.ఇప్పటికే కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో 20ఎకరాలచొప్పున సేకరించిన ప్రభుత్వం.

## నీట్ లీకేజీపై సీబీఐ విచారణ షురూ

### - ఎఫ్ఐఆర్ నమోదు - వ్యవహారంలో కీలక పరిణామం

ఢిల్లీ (ప్రజా మంటలు):
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు మే 5న నిర్వహించిన ఈ పరీక్షలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో దీనిపై దర్యాప్తు చేయాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు సీబీఐ ఆదివారం కేసు నమోదు చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలు జరిగినట్లు వస్తోన్న ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారించనుంది. అలాగే, బిహార్‌లో పేపర్ లీక్, పలుచోట్ల విద్యార్థులు సమయం కోల్పోయారంటూ వారికి గ్రేస్ మార్కులు కలపడం వంటి అంశాలపైనా సమగ్రంగా విచారించనుంది. కేంద్ర విద్యాశాఖ సూచనల మేరకు నమోదు చేసిన ఈ కేసులో నిందితులుగా గుర్తు తెలియని వ్యక్తులను చేర్చినట్లు సీబీఐ తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 24లక్షల మంది విద్యార్థులు రాసిన ఈ పరీక్షలో అక్రమాలు, మోసాలు జరిగాయని పలుచోట్ల కేసులు నమోదైనట్లు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. దీనిపై ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం పరీక్షల ప్రక్రియలో పారదర్శకత కోసం ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు సీబీఐకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సదరు అధికారి వెల్లడించారు.

## భాజపా, ఆర్ఎస్ఎస్‌ల కనుసన్నల్లో ఎన్టీయే

- లీకేజీలతో దేశవిద్యావ్యవస్థ నాశనమైంది
- నీట్ పీజీ ప్రవేశ పరీక్ష వాయిదాపై మండిపడ్డ కాంగ్రెస్

ఢిల్లీ (ప్రజా మంటలు):
నీట్ యూజీ, యూజీసీ నెట్ ప్రశ్నపత్రాల లీకేజీతో ముసురుకున్న వివాదాల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికిర్జున ఖర్గే కేంద్రంపై విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "నీట్‌లో జరిగిన అక్రమాలకు అధికారులను మార్చడం విద్యా వ్యవస్థలోని సమస్యకు పరిష్కారం కాదు. ఎన్‌టీఏ స్వయం ప్రతిపత్తి గల సంస్థ. కానీ.. ప్రస్తుతం అది భాజపా, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవహరిస్తోంది. విద్యార్థులకు న్యాయం జరిగేలా చూసే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి. ఇప్పుడు నీట్ పరీక్ష వాయిదా పడింది. ఈ పది రోజుల్లో దాదాపు 4 పరీక్షలను వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేశారు. పేపర్ లీకేజీలు, అవినీతి, అవకతవకలు మన విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాయి. దీని వల్ల నీట్ అభ్యర్థుల భవిష్యత్తు చిన్నాభిన్నం అవుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ హయాంలో దేశంలో విద్యావ్యవస్థ ధ్వంసమైందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. భాజపా పాలనలో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వంపై పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేశారు. పేపర్ లీక్ రాకెట్, విద్యాశాఖలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిస్సహాయంగా ఉందన్నారు. అసమర్థ మోదీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు పెను ప్రమాదమని, దేశ భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు.నీట్ పరీక్షను తొలుత మార్చి 3న నిర్వహించాల్సి ఉండగా.. ఆ తర్వాత జూలై 7న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అనంతరం జూన్ 23కి అంటే ఈరోజుకి సవరించారు. అయితే.. కొన్ని గంటల ముందు శనివారం రాత్రి 10 గంటలకు కేంద్ర ఆరోగ్యశాఖ స్పందిస్తూ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌కు ఉద్వాసన పలికింది. నీట్ యూజీలో అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు కేంద్ర విద్యాశాఖ ఆదేశించింది. ముందు జాగ్రత్త చర్యగా నీట్ పీజీ పరీక్షను వాయిదా వేస్తున్నామని శనివారం కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అతి త్వరలో పరీక్ష తేదీని ప్రకటిస్తామని తెలిపింది. వాయిదావల్ల విద్యార్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది.

## వెలుగులోకి విస్తుపోయే విషయాలు

### పేపర్ లీక్‌లో 'సాల్వర్‌గ్యాంగ్' హస్తం

పాట్నా (ప్రజా మంటలు):
నీట్ పరీక్షల్లో కొన్నేళ్లుగా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా పేపర్ లీక్‌లో 'సాల్వర్ గ్యాంగ్' హస్తం ఉన్నట్లు బయటపడటంతో బిహార్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. జాతీయ స్థాయిలో ఈ గ్యాంగ్ కీలక సభ్యుడు రవి అత్రి హస్తం ఉన్నట్లు బలంగా విశ్వసిస్తున్నారు. అతడి కనుసన్నల్లోనే నీట్ పేపర్ లీకైనట్లు భావిస్తున్నారు. నీట్ పేపర్ లీక్ వెనక ఈ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ముఠా ప్రశ్నపత్రాన్ని ముందుగానే చేజిక్కించుకోవడం.. దానికి సమాధానాలు తయారు చేసి.. వాటిని సోషల్ మీడియా ద్వారా కొనుగోలుదార్లకు పంపడంలో అందెవేసిన చెయ్యి. గతంలో కూడా వేర్వేరు రాష్ట్రాల్లోని పలు పరీక్ష పత్రాలను లీక్ చేసిన కేసుల్లో రవి అత్రి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. అతడికి ఆయా ప్రాంతాల్లోని ఎగ్జామ్ మాఫియాతో బలమైన సంబంధాలున్నాయి. ప్రశ్న పత్రాలను పరీక్షకు ఒక రోజు ముందు సంపాదించడంలో ఇతడు నిష్ణాతుడు. ఈ సాల్వర్ గ్యాంగ్‌కు డబ్బులు చెల్లిస్తే అసలు అభ్యర్థుల స్థానంలో నకిలీలను ప్రవేశపెట్టి పరీక్షలు రాయిస్తుంది. కచ్చితంగా ర్యాంక్ వస్తుందన్న హామీ ఇచ్చి.. భారీగా సొమ్ములు తీసుకొని ఈ పనిచేస్తుంది. 2007లో రవి అత్రిని తల్లిదండ్రులు మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ కోసం సిద్ధమయ్యేందుకు రాజస్థాన్‌లోని కోటాకు పంపించారు. అతడు అక్కడ కొన్నేళ్లపాటు చదువుకొని 2012లో పీజీఐ రోహ్‌తక్‌లో సీటు సంపాదించాడు. నాలుగో ఏడాది డ్రాపౌట్ అయ్యాడు. అప్పటికే అతడు ఎగ్జామ్ మాఫియాతో సంబంధాలు పెట్టుకున్నాడు. ఇతరుల మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్‌కు అతడు హాజరై పేపర్ రాసేవాడు. దీంతోపాటు లీకైన పేపర్లను పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించడం మొదలుపెట్టాడు. ఇతడిని ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు.ఈసారి నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర బిందువుగా నిలిచిన వ్యక్తి సంజీవ్ ముఖియా. ఇతడు కూడా సాల్వర్ గ్యాంగ్‌లో సభ్యుడే. ఇతడి కుమారుడు కూడా దీనిలో కీలక పాత్ర పోషించాడు. గతంలో బీపీఎస్సీ టీచర్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పరీక్ష, కానిస్టేబుల్ పరీక్షల లీకుల్లో కూడా వీరి హస్తం ఉంది. ప్రస్తుతం నీట్ వివాదం పెద్దదికావడంతో సంజీవ్ ముఖియా నేపాల్ పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. బిహార్ పొరుగు రాష్ట్రమైన ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ ప్రాంతం లీకులకు కేంద్రంగా మారుతోంది. ఇక్కడ ఒయాసిస్ స్కూల్ నీట్ పేపర్ లీకేజీలో కీలకంగా వ్యవహరించినట్లు బిహార్ పోలీస్‌లోని ది ఎకనామిక్ అఫెన్స్ వింగ్ గుర్తించింది. ఇక్కడ ట్యాంపర్ చేసిన నీట్ ప్రశ్నపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చిలో బీపీఎస్సీకి చెందిన టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష పత్రాన్ని కూడా ఇక్కడి నుంచే లీక్ చేశారు. అప్పుడు కూడా ఇక్కడ 268 మంది అభ్యర్థులకు ముందు రోజు రాత్రి ప్రశ్నపత్రం అందినట్లు అధికారులు గుర్తించారు.

## దేశ యువతకు మోదీ క్షమాపణ చెప్పాలి

### - అసదుద్దీన్ ఓవైసీ డిమాండ్

హైదరాబాద్ (ప్రజా మంటలు):
పరీక్షల యోధుడు ప్రధాని నరేంద్ర మోదీ అంటూ ఎమ్ఐఎమ్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ విమర్శించారు. మొదట నీట్ యూజీ, తర్వాత యూజీసీ-నెట్ నిర్వహించి 32 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. సీఎస్ఐఆర్-నెట్‌ను రద్దుచేసి 2 లక్షల మంది విద్యార్థులను, నీట్-పీజీ పరీక్షను ముందు రోజు రాత్రి రద్దు చేసి విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై బాధ్యత మోదీ ఆయన మంత్రి వర్గంపై ఉందని, దేశ యువతకు మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన ఎక్స్‌వేదికగా కోరారు.

## ముఖ్యమంత్రి అన్నీ కటింగులేనా..!

### - నర్సింహారెడ్డి కమిషన్ ముందు హాజరై మా వాదన వినిపిస్తాం - కేటీఆర్

హైదరాబాద్ (ప్రజా మంటలు):
సీఎం అంటే కటింగ్ మాస్టరా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. ప్రతి పథకంలో లబ్ధిదారుల సంఖ్యకు కోతపెట్టడమే లక్ష్యమా..? సీఎం అనే పదానికి ఇదే సరికొత్త నిర్వచనమా? అంటూ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు. నాడు పరుగు పరుగున వెళ్లి రైతులను లోన్ తెచ్చుకోమన్నారని.. నేడు రూ.2లక్షల రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. రూ.39వేలకోట్లు.. ఇప్పుడు రూ.31వేలకోట్లకు కటింగ్ పెట్టి కుదించారన్నారు. పాసుబుక్కులు లేవనే నెపంతో లక్షల మందికి శఠగోపం పెట్టే కుటిల ప్రయత్నం చేస్తే సహించమన్నారు. రేషన్ కార్డు సాకు చూపి.. లక్షల మందికి మొండిచెయ్యిచ్చే కుతంత్రం చేస్తే భరించమన్నారు.ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని కొంతమందికి.. చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఇంకొంతమందికి.. శూన్యహస్తం చూపే చీకటి పన్నాగాన్ని చూస్తూ ఊరుకునేది లేదన్నారు. మొన్న లక్షలాది మందిని రూ.500 సిలిండర్ పథకానికి దూరం చేశారని.. నిన్న 200 యూనిట్ల పథకానికి ఆంక్షలు పెట్టి ఆగమాగం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు రూ.2లక్షల రుణమాఫీని కూడా ఎగొట్టేందుకు లక్షలాది మంది రైతులకు ఎగనామం పెడతామంటే కుదరదన్నారు. నాట్ల నాడు ఇవ్వాల్సిన రైతుబంధుకు ఇప్పటికీ దిక్కులేదని.. ఓట్ల పండగ ముగిసినా.. ఎకరానికి రూ.7500ల రైతుభరోసాకు అడ్రస్సే లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రచారంలో 'అందరికీ అన్నీ' అన్నారని.. అధికారంలోకి రాగానే 'కొందరికే కొన్ని' అంటూ కోతపెడుతున్నారని ఎద్దేవా చేశారు. రుణమాఫీపై మాట తప్పినా.. మడమ తిప్పినా.. లక్షలాది రైతు కుటుంబాల తరపున ప్రశ్నిస్తాం.. పోరాటం చేస్తామంటూ ఆయన ఎక్స్(ట్విట్టర్) వేదికగా స్పందించారు.

### నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు..

హైదరాబాద్ (ప్రజా మంటలు):
తెలంగాణ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. సమాధాన పత్రాల మూల్యాంకనం పూర్తి చేసిన ఇంటర్ బోర్డు.. ఈ ఫలితాలను సోమవారం మధ్యాహ్నం 2గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మే 24 నుంచి జూన్ 3వరకు ఎఉ ఎనిబివతీ ంటలజీనిఇవట ాబీజూజూశ్రీవఏవనిబిజీతీఎ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. విద్యార్థులు తమ ఫలితాలను వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు దాదాపు దాదాపు నాలుగున్నర లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు సమాచారం. వీరిలో పరీక్షల్లో ఫెయిలైనవారితో పాటు ఫస్టియర్‌లో ఇంప్రూవ్‌మెంట్ కోసం రాసిన విద్యార్థులూ ఉన్నారు.

## మందుపాతర పేలి..

### - ఇద్దరు జవాన్లు వీరమరణం - సుక్మా జిల్లాలో ఘటన

రాయ్‌పూర్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా ప్రాంతంలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. సిలిగేర్-టేకులగూడెం ప్రాంతంలో మావోయిలు మందుపాతర పేల్చడంతో ఇద్దరు జవాన్లు వీరమరణం పొందారు. సైనికుల కదలికలను గమనించిన మావోయిలు ఐఈడీ పేలుడుకు పాల్పడినట్లు సమాచారం. ట్రక్కును లక్ష్యంగా చేసుకొని మావోలు ఐఈడీని పేల్చగా.. ఇద్దరు జవాన్లు దుర్మరణం చెందగా మరో మరికొందరు సైనికులు గాయపడ్డట్లు సమాచారం. ప్రస్తుతం సంఘటనా స్థలంలో భద్రతా బలగాలను మోహరించి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సిలిగేర్ నుంచి పూర్వీ వెళ్లే రహదారిపై పేలుడుకు పాల్పడినట్లు సమాచారం. పేలుడు ధాటికి జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఇద్దరు సైనికులు చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. మిగతా సైనికులకు చికిత్స అందిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఘటనపై ఏఎస్పీ ఆకాశ్‌రావు వివరాలు వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం సుక్మా జిల్లా ఝుగర్‌గుండ ప్రాంతంలోని క్యాంప్ సిలిగేర్, టేకులగూడెం మధ్య జవానుల వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారని.. ఐఈడీ సహాయంతో పేలుడుకు పాల్పడ్డారని తెలిపారు. వాహనంలో 2021 కోబ్రా బెటాలియన్‌కు చెందిన డ్రైవర్ విష్ణు, కానిస్టేబుల్ శైలేంద్ర వీరమరణం పొందారని తెలిపారు. సమాచారం అందుకున్న సీఆర్పీఎఫ్, కోబ్రా బెటాలియన్ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం సంఘటనా స్థలంలో తనిఖీలు కొనసాగుతున్నాయని వివరించారు.

## లోటు బడ్జెట్‌లోనూ హామీల అమలు

### - మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ (ప్రజా మంటలు):



లోటు బడ్జెట్‌లో ఉన్నా, తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లాలోని చిట్యాల వద్ద ఉన్న ఎన్‌హెచ్ 65 ఫ్లైఓవర్‌కు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి మాట్లాడుతూ బీఆర్?ఎస్? పదేళ్లలో చేయని అభివృద్ధి, కాంగ్రెస్ ఆరు నెలల్లో చేసిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. రూ.వేల కోట్లు దోచుకుని గత ప్రభుత్వం కూలిపోయే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్‌హెచ్ 65పై అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న 17 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని తెలిపారు. వీటి వద్ద తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.చిట్యాల వద్ద రూ.40 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టామని వివరించారు. మరోవైపు చౌటుప్పల్ వద్ద రూ.140 కోట్ల వ్యయంతో మరో ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌లోపు ఎన్‌హెచ్ 65 ఆరు లైన్ల రోడ్డుకు శంకుస్థాపన చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రూ.30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పూర్తి చేస్తామన్నారు. తనకు నల్గొండ, నకిరేకల్ రెండు రెండు కళ్లలాంటివని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును రానున్న మూడేళ్లలో పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. ఈ విధంగా చేస్తూ మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మిగిల్చిందని ఆవేదన చెందారు. లోటు బడ్జెట్‌లో ఉన్నా, ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు.



## మున్సిపల్ చైర్ పర్సన్ ను కలిసిన ఇన్చార్జి కమిషనర్

జగిత్యాల జూన్ 23 (ప్రజామంటలు):
జగిత్యాల మున్సిపల్ ఇంఛార్జి కమిషనర్ గా ఇటీవల నియామకమైన బి. చిరంజీవి మర్యద పూర్వకంగా మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ నివాసంలో వారిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. వారి వెంట మున్సిపల్ ఏఈ శరణ్ ఉన్నారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

### 7గురు అరెస్ట్, 4,50,000 నగదు, 7మొబైల్స్ మరియు ఒక కారు, బైక్ స్వాధీనం

### ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో అక్రమ కార్యక్రమాలపై పటిష్ఠ నిఘా

జగిత్యాల/ మేడిపల్లి జూన్ 23 (ప్రజామంటలు):



మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమారం గ్రామ శివారులో గల మామిడితోట లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై సీసీఎస్ పోలీసులు దాడి చేసి 7 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 4,50,000 నగదు, 7 మొబైల్స్ మరియు ఒక బైక్, కార్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిసిఎస్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాలతో అక్రమ, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పటిష్టం చేసి, పక్క సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నట్ల తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్సై శ్యామ్ రాజ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్ లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి. వెంట రమేష్ రావు, నవీన్ రావు లు ఉన్నారు.

## డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బాలిదాన్ దివస్



ఎల్కతుర్తి జూన్ 23 (ప్రజామంటలు):
శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బాలిదన్ దివస్ కార్యక్రమాన్ని 56వ డివిజన్ లో బీజేపీ ముఖ్య నాయకులు జన్ను మధు ఆధ్వర్యంలో 56 డివిజన్ అధ్యక్షులు మందోటి మహేందర్ పటేల్ అధ్యక్షతన జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు బలి దివాస్ దినోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.... పండిట్ శ్యామప్రసాద్ ముఖర్జీ 1901, జూలై 6 న జన్మించిన శ్యాంప్రసాద్ ముఖర్జీ ప్రముఖ జాతీయవాద నేతలలో ముఖ్యుడు. 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించాడు. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ, జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందినాడు. కలకత్తా విశ్వవిద్యాలయం కులపతిగా అతి పిన్న వయస్సు లో పనిచేసిన వ్యక్తి శ్యాంప్రసాద్ ముఖర్జీ కోల్‌కత లోనే ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి పి.హెచ్.డి. పూర్తి చేసి, ప్రారంభంలో కాంగ్రెసు వాదిగానే రాజకీయ జీవితం ఆరంభించాడు. స్వాతంత్ర్యానికి పూర్వం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా పనిచేశాడు. 1949లో ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నుంచి తప్పుకొని అక్టోబర్ 21, 1951 న జనసంఘ్ పార్టీని స్థాపించి, ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మే 23, 1953 న మరణించేవరకు కొనసాగినాడు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనస్యభులు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ మార్తినేని ధర్మారావు, వర్దన్నపేట్ మాజీ శాసనస్యభులు ఎస్.సి. మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ సెంట్రల్ ఫిల్మ్ సెన్సర్ బోర్డు మెంబెర్ జన్ను మధు గారు డివిజన్ అధ్యక్షులు మందోటి మహేందర్ ఉపాధ్యక్షులు లేగల శివరాం, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కళ్లపెల్లి అమృతరావు , జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కటకం రాజేష్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యాలయ కార్యాదర్శి అలుగునూరి కృష్ణం రాజు, డివిజన్ ఇంఛార్జి బండి హరీష్ సీనియర్ నాయకులు కోటగిరి నరేందర్, వేల్పుల శ్రీనివాస్, ముల్కనూరు చంద్రమౌళి, బొద్దిరెడ్డి సురేందర్ రెడ్డి, నల్ల రమేష్, కొత్తపెల్లి రవి తదితరులు పాల్గున్నారు.



## డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

జగిత్యాల జూన్ 23 (ప్రజామంటలు):
డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి బలిదాన్ దివాస్ పుణ్యతిథి సందర్భంగా భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, పట్టణ ఉపాధ్యక్షులు గదాసు రాజేందర్, మాజీ ఉపసర్పంచ్ సిరికొండ లక్ష్మణ్, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు లింగారెడ్డి, గడ్డాల లక్ష్మి, ఇట్యాల రామ్, గంగాధర్, సిరిపురం బాలాజీ, శంకర్, గణేష్ మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు కళ్యాణ మండపానికి రూ. 50 లక్షలు నిధులు

### మంజూరు చేసిన జెడ్పి ఛైర్పర్సన్ దావ వసంత

### అభివృద్ధి పనులకు భూమిపూజ



జగిత్యాల జూన్ 23 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం కళ్యాణ మండపానికి అభివృద్ధి పనుల నిర్మాణం కోసం రూ:50 లక్షల రూపాయిలు మంజూరు చేసి ఆదివారం రోజున భూమిపూజ చేసిన జిల్లా జెడ్పి ఛైర్పర్సన్ దావ వసంత సురేష్. మున్నూరుకాపు కళ్యాణ మండపానికి రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేసిన జిల్లా జెడ్పి ఛైర్పర్సన్ దావ వసంత కు కృతజ్ఞతలు తెలిపుతూ శాలువాలతో ఘనంగా సన్మానించిన మున్నూరు కాపు కుల సంఘం సభ్యులు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్ ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ,లైశెట్టి వెంకన్న,న్యాయవాది శ్రీరాములు,హరి అశోక్ కుమార్,గోపు రాజారెడ్డి,పడాల తిరుపతి,బండారి విజయ్,కొలగాని మధుసూదన్,పుప్పాల అశోక్,చీటీ లక్ష్మీ నారాయణ,లైశెట్టి నారాయణ,లైశెట్టి శేఖర్,చిట్ల అంజన్న, అయ్యోరి సుధాకర్, కూతురు శేఖర్, తీగెల అశోక్, తీగెల వెంకన్న, సంగి శేఖర్, సౌళ్ల భీమన్న, భూపతిపూర్ లక్ష్మీనారాయణ, మార్గం నరేష్, మల్లాపూర్ మండల అధ్యక్షుడు ముత్యాల శంకర్, గజ్జి శ్రీనివాస్, కోరుట్ల మండల అధ్యక్షుడు నత్తి రాజ్ కుమార్, వివిధ గ్రామాల నుండి విచ్చేసిన అధ్యక్ష కార్యవర్గం మరియు కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం పాల్గొన్న డా. భోగ శ్రావణి

సారంగాపూర్ జూన్ 23 (ప్రజామంటలు):



సారంగాపూర్ మండలము పెంబట్ల గ్రామంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో బీర్పూర్ మండల జెడ్పిటిసి పాత పద్మా రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజం, బొక్కల శేఖర్, బొక్కల రమేష్, వంగపల్లి ప్రణయ్, దూలూరి వంశీ, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు మహిళలు పాల్గొన్నారు.

## సేవాభావంతో కూడిన వృత్తి నిబద్దత తోనే ఉద్యోగులకు గుర్తింపు

సికింద్రాబాద్ జూన్ 23 (ప్రజామంటలు):



తమ పదవీకాలంలో సేవా భావంతో చేసే పనులు, వృత్తి నిబద్దత తే ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేసి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీ.ఆర్. రాధా రుక్మిణి, ఆమె భర్త మోహన్ దంపతులను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ బి.విద్యుల్లత, తెలంగాణ మిడ్ వైఫ్ నర్సింగ్ కౌన్సిల్, రిజిస్ట్రార్ బి.విద్యావతి, ప్రస్తుత సోమాజిగూడ ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జి. పద్మ, లెక్చరర్లు, సిబ్బంది హాజరయ్యారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ..నర్సుగా కెరీర్ ప్రారంభించి, 13 ఏండ్లు క్లినికల్ విభాగంలో , 26 ఏండ్ల పాటు టీచింగ్ విభాగంలో ప్రొఫెసర్ గా పనిచేసి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొందిన రాధా రుక్మిణి తన పదవీకాలంలో అందరి ఆదరాభిమానం పొందారని అన్నారు. విశాఖపట్నం, హైదరాబాద్, సిరిసిల్ల, సికింద్రాబాద్ ల్లోని నర్సింగ్ కాలేజీల్లో పనిచేసిన రాధా రుక్మిణి ఎందరో విద్యార్థులను ఉత్తమ నర్సులుగా తీర్చిదిద్దారన్నారు. ఒక వైపు కుటుంబాన్ని చూసుకుంటూ, మరో వైపు ఉద్యోగ బాధ్యతలను అంకిత భావంతో సమర్దవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

## రెండు కిడ్నీల చికిత్సకై రూ. 1,30,000 ఆర్థిక సహాయం

సికింద్రాబాద్ జూన్ 23 (ప్రజామంటలు):



సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లింగిశెట్ట హనుమంతురావు ఆధ్వర్యంలో 1,30,000 రూ. లు మున్నూరు కాపు కుల సోదరి సంధ్య కు ఆర్థిక సహాయం అందజేశారు. రెండు కిడ్నీలు ఫెయిల్ ఇబ్బంది పడుతు, ఆర్థికంగా ఇబ్బందిగా ఉండతున్న మున్నూరు కాపు సోదరికి సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘము అండగా నిలింది. కాచిగూడ మున్నూరు కావు మహాసభ తరపున 30 వేలు, తోట రఘునాథ 50 వేల రూ.లు, సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం నుంచి రూ. 50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంప చంద్రమోహన్, మణికొండ వెంకటేశ్వరరావు అధ్యక్షులు తెలంగాణ మున్నూరు కాపు మహాసభ తోట రఘునాథ్ , మంగళారపు లక్ష్మణ్ జనరల్ సెక్రెటరీ మహాసభ, లవంగాల అనిల్, ఆకుల రామారావు, చర్యల శ్రీనివాస్, జర్నలిస్ట్ మున్నూరు చందు, రాచూరి లక్ష్మి, నీలి జ్యోతి, మదన్ మోహన్, కట్కూరి శ్రీకాంత్, శామీర్ పేట్ శకృష్ణ, హరికృష్ణ, నువ్వుల ప్రభాకర్ లు పాల్గొన్నారు.

## బదిలీ పై వెళ్ళిన కలెక్టర్, అదనపు కలెక్టర్ వారిని సన్మానించిన జగిత్యాల టిఎన్జీవోలు

జగిత్యాల జూన్ 23 (ప్రజామంటలు):





జిల్లా కలెక్టర్ గా పనిచేసి బదిలీపై వెళ్లిన షేక్ యాస్మీన్ బాషా ఐఏఎస్ ని మరియు అదనపు కలెక్టర్ టి.ఎస్. దివాకర ఐఏఎస్ ని జగిత్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీఓ ఉద్యోగులు వారిని ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. స్థానిక సుమంగళి గార్డెన్ లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్ మాట్లాడుతూ ఉద్యోగులతో స్నేహ పూర్వకంగా మెదులుతూ వారికి ఏ విధమైన సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేవారని తెలుపుతూ వారికి టిఎన్జీఓల పక్షాన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లా నూతన కలెక్టర్ గా భాద్యతలు స్వీకరించిన బుడుమజ్జి సత్యప్రసాద్ ఐఏఎస్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా మరియు అదనపు కలెక్టర్ టి.ఎస్. దివాకర మాట్లాడుతూ.... జిల్లాను అన్ని రంగాలలో ముందుంచటంలో టిఎన్జీఓల సేవలు మరువలేనివని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీఓ నాయకులు సాహెద్ బాబు, రవీందర్, రాజేందర్, సుగుణాకర్, మధుకర్, మహమూద్, సురేందర్ నాయక్, మమత, పవిత్ర, ఖాజీం, మురళి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పదేళ్ల కెసిఆర్ పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగింది జెడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత

జగిత్యాల జూన్ 23 (ప్రజామంటలు):





జగిత్యాల రూరల్ మరియు అర్బన్ మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సహకారంతో జగిత్యాల రూరల్ మరియు అర్బన్ మండలాలు ఎంతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరాన్ని ప్రారంభించి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక పరంగా బలపడాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ జెడ్పీటీసీ మహేష్, రూరల్ మండల ఎంపీపీ మహేష్, అర్బన్ ఎంపీపీ ములాసపు లక్ష్మీ, పాక్స్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, ఎంపీటీసీ ఆరే సౌజన్య, మాజీ సర్పంచ్లు రజితశేఖర్, నరేష్, దామోదర్, ప్రవీణ్ గౌడ్, మరియు మున్నూరు కాపు కుల బాందవులు, స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తాటి చెట్టుపై నుండి జారి కింద పడిన గీత కార్మికుడు

ఇల్లందకుంట జూన్ 23 (ప్రజామంటలు):
మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ తిరుపతి %ం/శీ% రాజ కనకయ్య వయసు 50 సంవత్సరాలు వృత్తి రీత్యా ఉదయం 8:00 గంటలకు. తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కింద పడినాడు. చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని సంజీవని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించడం జరిగింది. అతనికి పక్క ఎముకలు విరిగినాయి. అతనికి ప్రభుత్వం నుండి మరియు గౌడ కార్పొరేషన్ నుండి ఆర్థిక సాయం అందించాలని సర్వాయి పాపన్న గీత పారిశ్రామిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రాజమౌళి గౌడ్, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు మోటపోతుల దేవేందర్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మోత్కూర్ శ్రీనివాస్ గౌడ్, పైడిపల్లి వీరాస్వామి గౌడ్, ఆరెల్లి తిరుపతి గౌడ్, బొమ్మ నరసయ్య గౌడ్, దొరి తిరుపతి గౌడ్ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.





# పదోన్నతుల మిగులు పోస్టులను తక్షణం భర్తీ చేయాలి

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

హనుమకొండ జూన్ 23 (ప్రజామంటలు):



జిల్లాలోని టీఎస్ యుటిఎఫ్ భవన్ లో రాష్ట్ర కార్యదర్శి కే. సోమశేఖర్ అధ్యక్షత వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో నల్గొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మాట్లాడుతూ.... కొంతమంది ఉపాధ్యాయులు రెండు, మూడు సబ్జెక్టుల పదోన్నతులకు ఎంపిక అయ్యారని, వారు కోరుకున్న సబ్జెక్టును మినహాయించి మిగతా సబ్జెక్టులలో వారిని తొలగించి మిగతా ఉపాధ్యాయులతో భర్తీ చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడంలో ప్రజాప్రతినిధులు కూడా కీలకపాత్ర వహించాలని కోరారు. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో కూడా బదిలీలు వెంటనే నిర్వహించి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ.... ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న కరువు భత్యాలను, పెండింగ్ బిల్లును వెంటనే క్లియర్ చేయాలని, రిటైర్ అయిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ త్వరితగతిని అందజేయాలని అన్నారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి మల్టీజోన్ -1, మల్టీ జోన్-2లో జరుగుతున్న ఎస్జిటీల బదిలీల్లో అన్ని ఖాళీలు చూపించాలని, సీనియారిటీ జాబితాలలో తప్పులు లేకుండా చూడాలని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు గొప్ప సమ్మారావ్, కే రంజిత్ కుమార్, ఎస్ మల్లారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఆవారి శ్రీనివాస్, గురుకుల ఉపాధ్యాయుల కన్వీనర్ ఎల్లయ్య, టీఎస్ యుటిఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు రవీందర్ రాజు, పెండెం రాజు, బద్దం వెంకటరెడ్డి, కుమార్, సుజన్ ప్రసాదరావు, చంద్రశేఖర రావు, మురళి ,యాకూబ్, వాసుదేవ రెడ్డి తిరుపతి, రామయ్య మరియు ఆరు జిల్లాల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జూన్ 23 (ప్రజామంటలు):



జగిత్యాల 11వ వార్డ్ గాంధీనగర్ లో జరిగిన పొంగు బోనాల ఉత్సవంలో పాల్గొన్న జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మాదిగ యువజన సేవ సంఘం అధ్యక్షులు కోలేపాక మల్లేష్, పెద్దమనిషి చంద్రయ్య, 12వ వార్డ్ కౌన్సిలర్ నక్క జీవన్, 11వ వార్డ్ కాంగ్రెస్ నాయకులు గిరిధర్, కౌన్సిలర్ బాలే శంకర్, కార్మిక జిల్లా అధ్యక్షులు బొల్లి శేఖర్, సంఘ సభ్యులు ప్రసాద్, నాగరాజు, చిర్ర సతీష్, మల్యాల అశోక్, బాలే శంకర్, విజయ్, మారుతి, దొనకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విలేకరిపై తప్పుడు కేసు పెట్టిన సిఐ సస్పెండ్



ఖమ్మం జూన్ 23 (ప్రజామంటలు):

ఖమ్మం పట్టణంలో స్థానిక విలేకరి ఇంటిలో తుపాకీ తూటాలు దొరికినట్లుగా తప్పుడు కేసులు పెట్టడం. అధికారాన్ని దుర్వినియోగం చేసి పోలీసు గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించిన సీఐ శ్రీధర్ ను సస్పెండ్ చేస్తూ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# అమ్మ మాట



శంకర్ వాళ్ళ నాన్న కి మచిలీపట్నం నుండి విజయవాడ కు బదిలీ అయింది. శంకర్ ఎనిమిది పాస్ అయి తొమ్మిదవ తరగతి కి వచ్చాడు. అప్పటి వరకు శంకర్ ప్రభుత్వ పాఠశాల లో చదివాడు. కానీ విజయవాడ లో వాళ్ళ ఇంటికి దగ్గర ప్రభుత్వపాఠశాల లో సీట్ దొరక్క ప్రైవేట్ స్కూల్ లో చేరాలిసి వచ్చింది. దగ్గరలోని ప్రభుత్వపాఠశాల ల్లో ఎక్కడా సీట్ దొరకలేదు. అందువల్ల ఫీజు ఎక్కువ అయినా ప్రైవేట్ స్కూల్ లో చేర్చారు. శంకర్ మంచి స్టూడెంట్. మంచిమార్కులు ఉండటం వల్ల ఫీజు తగ్గించారు. శంకర్ సన్నగా, బక్కగా చామన ఛాయగా ఉంటాడు. మెల్లకన్ను. మందపాటి కళ్లద్దాలు పెట్టుకుంటాడు. బడిలో చేరిన మొదటి రోజు తరగతి లో పిల్లలు ఎవరూ శంకర్ తో కలవలేదు. పైగా మెల్లకన్ను, సోడబుడ్డి కళ్లద్దాలు అని గుసగుసగా మాటాడుకున్నారు. శంకర్ నాన్న చిన్న ఉద్యోగం కావడం, ముగ్గురు పిల్లలు, ముసలితల్లి ని పోషించాల్సి నందున ఇంట్లో అందరు చౌక రకం బట్టలు కట్టుకునేవారు. శంకర్ బట్టలు, కళ్ళజోడు చూసిమిగిలిన పిల్లలు హేళన గా మాట్లాడసాగారు. మెల్లకన్ను నువ్వు ఎక్కిరించి వేళాకోళం చేయసాగారు. ఎవరూ వాళ్ళ పక్కన కూర్చోనివ్వకపోవడం తో వెనకబెంచ్ కి వెళ్లి కూర్చున్నాడు. మాట కలపడానికి ప్రయత్నిస్తే ఎవరూ పలకలేదు. పాఠాలు ఎంతవరకు చెప్పారో అడిగినా జవాబు చెప్పలేదు. అలా వెక్కిరిస్తూ ఉంటే శంకర్ కిచాలా బాధ గా అనిపించింది.

వారం గడిచినా ఎవరూ శంకర్ తో మాట్లాడలేదు. ఆటల్లో కూడా కలుపుకో లేదు. శంకర్ వాళ్ళ వెక్కిరింపులు తప్పించుకోవడానికి లైబ్రరీ పుస్తకం తీసుకుని చదువుకోవడం, లెక్కలు చేసుకోవడం మొదలు పెట్టాడు. అది చూసి మిగతా పిల్లలు ప్రొఫెసర్ మెల్లగారు అంటూ ఎద్దేవా చేసారు. శంకర్ వల్ల మాటల పట్టించుకోకూడదను కునేవాడు. కానీ ఒక రోజు కళ్ళజోడు దాచిపెట్టి ఏడిపించారు. క్లాస్ అయ్యాక అతని బెంచ్ మీద పెట్టి జారుకున్నారు.

శంకర్ ఇంటికి వెళ్లి అమ్మతో మెల్లకన్ను ఉంటే తప్పా అమ్మా అని బావురుమని ఏడ్చాడు అమ్మ శంకర్ కళ్ళు తుడిచి బుజ్జగించి విషయం కనుక్కుంది.నువ్వు వాళ్ళు అలా ఏడిపిస్తుంటే కుంగిపోకూడదు. నీకు బలహీనత మెల్లకన్ను. వాళ్ళు అది అలుసుగానిన్ను వేళాకోళం చేస్తున్నారు. నువ్వు వాళ్ళ బలహీనత కనిపెట్టి నీ బలం నిరూపించు కోవాలి వాళ్ళు ఎందులో నీ కన్నా తక్కువ అని కనిపెట్టి నీ ప్రావీణ్యం చూపించి వాళ్ళ నోరు మూయించాలి, అంటూ ధైర్యం చెప్పి కళ్ళు తుడిచింది. శంకర్ మనసులో ఆ మాటలు బాగా నాటుకున్నాయి. ఇంతలో క్వార్టర్లీ పరీక్షలు వచ్చాయి. శంకర్ భాగా చదివి రాసాడు. టీచర్ ప్రోగ్రెస్ కార్డు ఇస్తూ శంకర్ కి ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని లెక్కలు నూటికి నూరు తెచ్చుకున్నాడని అభినందనలు తెలిపారు. మిగిలిన పిల్లలు అది చూసి చాలా ఖంగు తిన్నారు. అయినా ఇవి క్వార్టర్లీ పరీక్షలే కదా ముందు ముందు చూద్దాం అని గొణుక్కున్నారు. కానీ శంకర్ తో మటుకు స్నేహం చేయడానికి ముందుకు రాలేదు నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష రాసిన శంకర్ పరీక్ష పాస్ అయి స్కాలర్ షిప్ సంపాదించాడు. టీచర్ మెచ్చుకోవడం చూసి “అబ్బో. సోడా బుడ్డి స్కాలర్ షిప్ కొట్టాడు అని ఆశ్చర్య పోయారు. వెక్కిరింతలు కొద్దిగా తగ్గించారు.ఆంగ్ల దినపత్రిక ఊరిలోని స్కూల్స్ మధ్య క్విజ్ పోటీ నిర్వహించడం కోసం నోటీసు పంపింది. స్కూల్లో జట్టు నువ్వు ఎంపిక చేయడానికి టీచర్ పోటీ పెట్టారు. శంకర్ నువ్వు ఎవరూ టీం లోకి రమ్మని పిలవలేదు. అయినా టీచర్ అడిగిన జనరల్ నాలెడ్జి ప్రశ్నలు, సబ్జెక్టు ప్రశ్నలు వంటరిగా శంకర్ టకటక జవాబు చెప్పడం తో టీచర్ శంకర్ణి టీం లీడర్ గా ఎంపిక చేసారు. శంకర్ జనరల్ నాలెడ్జ్ చూసి మిగతా వాళ్ళు నోరు వెళ్లబెట్టారు.

క్విజ్ లో వీళ్ళ స్కూల్ గెలిచి నేషనల్ కి ఎంపిక అయింది. శంకర్ ప్రతిభ వల్ల గెలిచారు అని అంతా అన్నారు. శంకర్ కి క్విజ్ నిర్వాహకులు ప్రత్యేకంగా సైకిల్ బహుమతి ప్రకటించారు.మర్నాడు స్కూల్ ప్రిన్సిపాల్ క్విజ్ లో గెలిచిన టీం ను అభినందించి శంకర్ లాగా స్కూల్ పేరు నిలబెట్టాలని చెప్పారు. శంకర్ టీం వాళ్ళు తాము గెలవడానికి ముఖ్య కారణం శంకర్ అని అర్థం చేసుకుని ఇన్నాళ్లు అతడిని ఎద్దేవా చేసి వెక్కిరించినందుకు సిగ్గుపడి క్షమాపణ చెప్పారు. లెక్కలు, సైన్స్ తమకు అర్థం కానివాటిని శంకర్ ను అడిగిన చెప్పించుకో సాగారు. అరె. శంకర్. నువ్వు భలే బాగా చెపుతా వురా. నువ్వు చెబితే ఇట్టే అర్థం అయిపోతుంది. అనసాగారు. శంకర్ ఆ ఏడాది స్కూల్ ఫస్ట్ వచ్చాడు.నేషనల్ లెవెల్లో స్కూల్ కి క్విజ్ లో ఛాంపియన్ గా నిలబడి గెలిచాడు. కొత్త తరగతి లో శంకర్ మొదటి బెంచ్ లో కూచోమని వాడి పక్కన కూచోవడానికి అందరు పోటీ పడసాగారు. శంకర్ నువ్వు క్లాస్ లీడర్ గా ఎన్నుకున్నారు. ఇప్పుడు శంకర్ కు అందరూ స్నేహితులే. అమ్మ చెప్పిన మాట నువ్వు శంకర్ ప్రతీ రోజు గుర్తు చేసుకుంటాడు.

**రచన. ముంజులూరి కృష్ణ కుమారి**
**విజయవాడ**




## కవిత్వం

### చెట్టు విలువ

బాల గేయం

రోహిణి కార్తె వచ్చింది
ధగ ధగ సెగలు కక్కింది
రోళ్ల పగుళ్ళు చూపింది
దాహార్తినే పెంచింది

భగ భగ మంట లేసింది
వడ గాడ్పులే వీచింది
మల మల జనుల
మాడ్చింది
సల సల నీళ్ల కాగింది

భయ భ్రాంతులు
కలిగించింది
ఇంటి పట్టునే ఉంచింది
గుట్టుగ అన్నీ నేర్పింది
చెట్టు విలువనే తెలిపింది

చలి వేంద్రాలే తెచ్చింది
చల్లని నీరే ఇచ్చింది
చక్కగ దాహాన్ని తీర్చింది
మొక్కలు ఎన్నో
నాటమంది

గుండాల నరేంద్రబాబు
తిరుపతి,
9493235992

# తెలుగు కథకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన పాలగుమ్మి

## జూన్ 24... పాలగుమ్మి పద్మరాజు జయంతి



తెలుగు కథా సాహిత్యంలో ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు. అయన తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించారు. పాలగుమ్మి పద్మరాజు 1915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. విద్యాభ్యాసం స్వస్థలంలోనూ, ఇతర ప్రాంతాల లోనూ పూర్తి చేసుకున్న ఆయన 1939వ సంవత్సరం నుండి 1952 వరకు కాకినాడలోని పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా విధులు నిర్వహించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

తన పంతొమ్మిదో యేట నుంచే రచనలు మొదలు పెట్టారు. మొదట ఛందోబద్ధంగా పద్యాలు రాసి తర్వాత వచనం లోకి వచ్చారు. పాలగుమ్మి పద్మరాజు తన సాహిత్య జీవన యానంలో 60 కథలు, ఎనిమిది నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు మరియు నాటకాలను రచించారు. ఆయన రాసిన 60 కథలలో గాలివాన, పడవ ప్రయాణం, ఎదురు చూసిన ముహూర్తం అనే మూడు సంపుటాలుగా వెలువడ్డాయి.

తెలుగు మీద ఎంత పట్టు ఉందో ఇంగ్లీష్ మీద కూడా అంతే అధికారం ఉంది. అందుకే తాను రాసిన కథానికలను తానే ఆంగ్లంలోకి తర్జుమా చేసుకునే వారు. ఆ క్రమంలోనే 1958లో అంతర్జాతీయ కథానికల పోటీలో ‘గాలివాన’ కథ రాసి పంపితే బహుమతి వచ్చింది. “గాలివాన” తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మికే చెందుతుంది. ఈ కథను ప్రపంచం లోని అనేక బాషలలోకి అనువదించారంటే ఆ నవల సాహితీ ప్రపంచంలో ఎంతగా పేరు తెచ్చుకుందో అర్థం అవుతుంది. అయన మొదటి కథ “సుబ్బి”. ఎన్నో కథలు రాసినప్పటికీ వాటిలో ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చిన కథ “గాలివాన” మాత్రమే. ఈ కథ 1952వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని “హెరాల్డ్ ట్రిబ్యూన్”వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలలో రెండువ బహుమతిని గెలుచుకుంది.

ఈ పోటీలకు మొత్తం 23 దేశాల నుంచి 59 కథలు ఎంపిక కాగా, అందులో భారత దేశం నుంచి మూడు కథలు ఎంపికవగా.. అందులో గాలివాన ఒకటి. అలా తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఆయన రాసిన నవలలో బతికిన కాలేజీ, నల్లరేగడి, రామరాజ్యానికి రహదారి, రెండో అశోకుడి మూన్నాళ్ల పాలన మొదలైన రచనలు ముఖ్యమైనవి.

ఆయన రాసిన కవితలు, పద్యాలు, పాటలు, కథానికలు, నవలలు. రేడియో నాటకాల గురించి అందరికీ తెలిసినా సినిమా రచనల గురించి చాలా మందికి తెలియదు. ఆయన సినిమా ప్రవేశం కృష్ణశాస్త్రి ద్వారా జరిగింది. నాటికే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమాలకు పాటలు రాస్తున్నారు. బిఎన్‌రెడ్డి సినిమా తీయాలనుకున్న సంగతి తెలిసి పద్మరాజుకు కబురు చేస్తే మద్రాసు వెళ్లారు. 1954వ సంవత్సరంలో ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, తాను వాహినీ పతాకం కింద నిర్మించిన “బంగారు పాప” అనే చిత్రానికి మాటలు రాయమని పద్మరాజును కోరారు. అప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక సినిమాలకు కథలు, పాటలు పాలగుమ్మి కలంనుంచి జాలు వారాయి. ‘బంగారుపాప’ సినిమాలో కోటయ్య పాత్ర ఎస్వి రంగారావుకు చాలా పేరు వచ్చింది. ‘ఇటువంటి పాత్ర మళ్లీ నాకు దొరకలేదు’ అని ఎన్నోసార్లు చాలామందితో సంబరంగా అనేవారట. ఆ తరవాత ‘రంగుల రాట్నం’ చిత్రానికి కథ మాటలు రాశారు. ఆ కథకు నంది అవార్డు వచ్చింది. రంగుల రాట్నం నటుడు చంద్రమోహన్ పాత్రకు ప్రాణం పోసి, ఆయనను చిత్ర సీమలో నిలబెట్టింది. తర్వాత భావ నారాయణ తీసిన ‘గోపాలుడు భూపాలుడు’ జానపద చిత్రానికి కథ, మాటలు అందించారు. మురారి నిర్మాణంలో వచ్చిన ‘సీతామాలక్ష్మి’ చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. సినిమా అంటే అవగాహన ఉండి పాటలు, మాటలు, కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, సంగీతం,.. అన్ని శాఖల లోనూ పని చేశారు. దేవుడిచ్చిన భర్త, బికారి రాముడు... చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తం 30కి పైగా సినిమాలకు పని చేశారు. ఎడిటింగ్, ప్రాసెసింగ్, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ దాకా అన్నీ చూసి నేర్చుకున్నారు. శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ సినిమాకు పాటలు రాయడానికి కృష్ణశాస్త్రి రావడం కొంచెం ఆలస్యం అయితే పద్మరాజు తో ఒక పాట రాయించారు, అదే ‘రాకోయీ అనకోని అతిథి’. అంతకు ముందే ‘భక్త ప్రహ్లాద’ చిత్రానికి ‘జననీ వర దాయనీ భవానీ’ అనే గీతం కూడా రచించారు.

దాసరిగారితో చాలా సినిమాలు చేశారు. దాసరి, పద్మరాజును ‘మా గురువు గారు’ అనే వారు. దాసరి, పద్మరాజు వద్ద రైటర్‌గా పని చేశారు. దాసరి ఒకేసారి నాలుగైదు సినిమాలు తీయడం వల్ల పద్మరాజు సలహాలను ఎక్కువగా అడిగేవారు.

తరువాత భక్త శబరి, బంగారు పంజరం లాంటి అనేక సినిమాలలో పాలగుమ్మి పనిచేసినా... తన సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, వ్యాపారపరంగా నష్టాలను చవి చూశాయి. పాలగుమ్మి దర్శకుడిగా “బికారి రాముడు” అనే సినిమాను తీసినా అది కూడా విజయవంతం కాలేదు.

ఆ తరువాత పాలగుమ్మి నవల “నల్లరేగడి”ని “మాఊరి కథ” అనే పేరుతోనూ, “పడవ ప్రయాణం” అనే కథను “స్త్రీ” పేరు తోనూ సినిమాలు తీశారు. సాహితీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన అచ్చ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1983 ఫిబ్రవరి 27న మరణించారు.